7

సాక్షి సిద్దిపేట

మంగళవారం। 7। జనవరి। 2025




వరిలో జింక్ లోపం

అధికంగా భాస్వరం ఎరువుల వినియోగంతో వరిలో జింక్ లోపం ఏర్పడుతుందని ఏఓ శ్రీనాథ్ తెలిపారు. వివరాలు 8లో ▸



సంప్రదాయ ఆహారం మేలు

యువత జంక్ ఫుడ్‌ను వదిలేసి, సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవాలని వక్తలు సూచించారు. వివరాలు 8లో ▸



సమస్యల 'జాతర'

కొండపోచమ్మ ఉత్సవాలు సమీపిస్తున్నా సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదు. వివరాలు 9లో ▸

మరింత సహకారం

జిల్లాలో మరిన్ని కొత్త సొసైటీలు

- ప్రస్తుతం 21 సంఘాలు.. 87వేల మంది సభ్యులు
- మరో 16 కొత్త వాటి కోసం ప్రతిపాదనలు



సాక్షి, సిద్దిపేట: గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ప్రధానమైన వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలిచే సహకార సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సహకార సంఘాల సేవలు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించారు. ముందుగా ఆయా పీఏసీఎస్‌లు, ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలను జిల్లా సహకార శాఖ స్వీకరించింది. జిల్లాలో నూతనంగా 16 సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

గ్రామాల్లో సేవలు విస్తరించేందుకు..

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 21 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. అందులో 87,197 సభ్యులున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు, పంట రుణాల పంపిణీ, గిడ్డంగులు, పెట్రోల్ బంక్‌లు, ఇలా పలు సేవలు రైతులకు అందిస్తున్నారు. కొత్తగా మండలాలు ఏర్పడినప్పటికీ మండల కేంద్రాల్లో పీఏసీఎస్‌లు లేవు. ఈ క్రమంలో అన్ని మండల కేంద్రాల్లో, అవసరం ఉన్న గ్రామాల్లో సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టింది.

37కు చేరుకోనున్న సంఘాలు..

కొన్ని సంవత్సరాలుగా కొత్తగా సంఘాలు ఏర్పాటు చేయలేదు. గతంలో నష్టాల్లో ఉన్న సంఘాలను మరో సంఘంలో విలీనం చేశారే తప్ప కొత్తవి ఏర్పాటు చేయలేదు. పలు పాత, కొత్త మండల కేంద్రాల్లో సైతం సంఘాలు ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వం మండలానికి రెండు సంఘాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు స్వీకరించింది. కానీ ఏర్పాటు చేయలేదు. మళ్లీ ఇటీవల కొత్త, పాత మండల కేంద్రాల్లో సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు స్వీకరించారు. కొత్తగా 16 సంఘాలు ఏర్పాటు చేస్తే జిల్లాలో సహకార సంఘాలు 37కు చేరుతుంది. దీంతో రైతులకు అందుబాటులో సేవలు లభ్యమవుతాయి.

కొత్తగా సొసైటీలు ఏర్పాటయ్యే గ్రామాలు ఇవే..

మండలం	గ్రామం
చిన్నకోడూరు	చిన్నకోడూరు, ఇబ్రహీంనగర్
నారాయణరావుపేట	నారాయణరావుపేట, గుర్రాలగొంది
అక్బర్‌పేట-భూంపల్లి	అక్బర్‌పేట-భూంపల్లి
రాయపోలు	రాయపోలు
మర్కూక్	మర్కూక్
దూళ్మిట్ట	దూళ్మిట్ట
అక్కన్నపేట	అక్కన్నపేట
కుకునూరుపల్లి	కుకునూరుపల్లి
సిద్దిపేట రూరల్	సిద్దిపేట రూరల్
కొమురవెల్లి	కొమురవెల్లి
హుస్నాబాద్	రామవరం
గజ్వేల్	పిడ్‌చెడ్
నంగనూరు	నర్మెట్ట
బెజ్జంకి	బేగంపేట

ప్రతిపాదనలు పంపించాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతిపాదనలను స్వీకరించాం. అందరి అభిప్రాయాలను తీసుకొని నివేదించాం. జిల్లాలో కొత్తగా 16 సంఘాలు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం.

– నాగేశ్వర్ రావు, డీసీఓ



అతివలే అధికం

ఓటరు జాబితా రెడీ

- ఉమ్మడి మెదక్ జిల్లాలో పురుషులు: 14.16లక్షలు
- మహిళా ఓటర్లు : 14.52లక్షలు

సాక్షి, సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. సవరించిన ఓటరు జాబితాను సోమవారం ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 28,70,233 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 14,52,905, పురుషులు 14,16,166, ఇతరులు 229, సర్వీస్ ఓటర్లు 933 మంది ఉన్నారు. కొత్తగా 20,458 ఓటర్లు నమోదు కాగా 11,769 మంది ఓటర్లను తొలగించారు.

పటాన్‌చెరులో అత్యధికం

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని పటాన్‌చెరు నియోజకవర్గంలో అత్యధికంగా, దుబ్బాక నియోజకవర్గంలో అత్యల్పంగా ఓటర్లు ఉన్నారు. పటాన్‌చెరు, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో పురుషులే అధికంగా ఉన్నారు. మిగతా నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. పటాన్‌చెరులో అధికంగా థర్డ్‌జెండర్లు ఉంటే, దుబ్బాకలో ఒక్కరు కూడాలేరు.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	సర్వీస్	మొత్తం
సిద్దిపేట	1,17,509	1,22,459	71	103	2,40,142
హుస్నాబాద్	1,23,083	1,27,837	06	224	2,51,150
మెదక్	1,04,917	1,15,987	04	89	2,20,997
నారాయణఖేడ్	1,18,848	1,18,563	09	65	2,37,485
అందోల్	1,23,244	1,29,386	03	51	2,52,684
జహీరాబాద్	1,38,914	1,39,315	03	104	2,78,336
సంగారెడ్డి	1,24,235	1,28,097	38	62	2,52,432
నర్సాపూర్	1,11,611	1,18,701	05	38	2,30,355
పటాన్‌చెరు	2,15,945	2,03,466	85	73	4,19,569
దుబ్బాక	97,653	1,03,859	0	55	2,01,567
గజ్వేల్	1,40,207	1,45,235	05	69	2,85,516

న్యూస్‌రీల్

నాచగిరి ఈఓ అన్నపూర్ణ బదిలీ

- ఇన్‌చార్జిగా సిద్దిపేట ఈఓ



వెంకటేశ్వరశర్మకు బాధ్యతలు అప్పగిస్తున్న అన్నపూర్ణ

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధమైన నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ అన్నపూర్ణ బదిలీ అయ్యారు. ఆమె నగరంలోని చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో సిద్దిపేట వేంకటేశ్వరాలయ ఈఓ పార్నంది వెంకటేశ్వరశర్మకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయ శాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు సోమవారం వెంకటేశ్వరశర్మకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహాయ సహకారాలు అందించిన అర్చకులకు, సిబ్బందికి, ఆలయ పరిధిలోని గ్రామస్తులకు, తోడ్పాటు అందించిన దాతలకు ఈఓ అన్నపూర్ణ ధన్యవాదాలు తెలిపారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేద్దాం



ప్రిన్సిపాల్ అనితా అబ్రహం సమక్షంలో ఒప్పందం చేసుకుంటున్న రోహిణి

గజ్వేల్‌రూరల్: విద్యార్థుల ఉజ్వలమైన భవిష్యత్‌కు బాటలు వేయడమే తమ కర్తవ్యమని మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ట్రైనర్ రోహిణి అన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ శోభారాణి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం సమక్షంలో సోమవారం మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ద్వారా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడారు. తమ సంస్థ ద్వారా కళాశాలలోని తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఎంప్లాయిమెంట్ ఎబిలిటీ స్కిల్స్, సాఫ్ట్, లైఫ్ స్కిల్స్, కేరీర్ టాక్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థినులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్స్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సంఘం సభ్యులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చిన్నకోడూరు కళాశాల ప్రిన్సిపాల్ కూచంగారి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘంలో ఖాళీ అయిన సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పోస్టులను త్వరలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి భర్తీ చేస్తామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌ను సన్మానించి అభినందించారు.

మైనార్టీలకు ఉచిత కుట్టుమిషన్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో భాగంగా క్రిస్టియన్ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ, నిరుపేద, వితంతువులు, అనాథ, ఒంటరి మహిళలు ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కారం

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్
- ప్రజావాణిలో 96 దరఖాస్తులు

సిద్దిపేటరూరల్: ప్రజలు అందించిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కారానికి చర్యలు చేపట్టి రిపోర్ట్‌ను కలెక్టరేట్‌లో అందించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలు అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూసమస్యల పరిష్కారం కోరుతూ మొత్తంగా 96 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రహమాన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అవినీతి అధికారిని తొలగించండి

అవినీతి అధికారిని తొలగించాలని కాంట్రాక్టర్ కలీముద్దీన్ డిమాండ్ చేశారు. ప్రజావాణిలో ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్‌గా పలు నిర్మాణాలు చేపడుతున్నానన్నారు. జిల్లా గృహనిర్మాణ శాఖ విభాగంలో ఇంజనీరింగ్ పై ఎలాంటి అవగాహన లేని రిటైర్డ్ ఉపాధ్యాయుడిని అవుట్‌సోర్సింగ్‌గా కొనసాగించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. నిర్మాణం అనంతరం కాంట్రాక్టర్లు పేమెంట్ కోసం వస్తే బిల్లులపై లేనిపోని సమస్యలు సృష్టిస్తూ 5శాతం కమీషన్ ఇవ్వాలని కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. చింతమడక గ్రామంలోని లబ్ధిదారుల నుంచి కూడా డబ్బులను డిమాండ్ చేస్తున్నారన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

అవకతవకలపై ఫిర్యాదు

సిద్దిపేటకమాన్: చిన్నకోడూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో అవకతవకలు జరిగాయని ఈ విషయంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని బీజేపీ చిన్నకోడూరు మండల నాయకులు తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడుతూ.. ఆర్‌టీఐ చట్టం ప్రకారం దరఖాస్తు చేయగా వచ్చిన సమాచారంలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. రెవెన్యూ రికార్డులు, సర్టిఫికెట్ల జారీలో అవకతవకలు జరిగాయన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే..

- వారివి అర్థంలేని ఆరోపణలు
- గుట్టలకు, రాళ్లకు రైతు భరోసా ఇవ్వాలా? తేల్చాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ఆర్థిక వెసులుబాటుతో సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటై కాంగ్రెస్ ప్రభుత్వంపై అర్థంలేని ఆరోపణలు చేస్తున్నాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. సోమవారం హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసి, రూ.40 వేల కోట్ల పెండింగ్ బిల్లులు అప్పజెప్పిందన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ప్రాధాన్యత ఉన్న పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 125 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారన్నారు. 55వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. రైతు భరోసా పేరిట వ్యవసాయ యోగ్యమైన భూమికి ఏటా ఎకరాకు రూ.12వేలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. బీజేపీ ప్రభుత్వానికి రైతుల ప్రేమ ఉంటే మేము ఇస్తున్న రైతు భరోసాకు మరో రూ.12వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. సన్న వడ్లకు రూ.500 బోనస్, భూమి లేని పేదలకు రూ.12వేలు, రైతు రుణ మాఫీ బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెట్టే రైతు వ్యతిరేక చట్టాలను తెస్తోందన్నారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కేటీఆర్‌లు ఒకే స్వరంలో మాట్లాడుతున్నారని తెలిపారు.



రామవరంలో డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం

డబుల్ లేన్ రోడ్డుకు రూ.25కోట్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): హుస్నాబాద్ మీదుగా రామవరం గ్రామం వరకు నిర్మించనున్న డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులు మంజూరైనట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలపారు. ఈమేరకు సోమవారం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డబులలేన్ రోడ్డు నిర్మాణానికి సీఆర్‌ఐఎఫ్ నిధులు రూ.25కోట్లు మంజూరయ్యాయన్నారు. మూలమలుపులు లేకుండా నాణ్యతతో కూడిన రోడ్డును నిర్మించనున్నామన్నారు. అలాగే త్వరలోనే మండలంలోని చౌటపల్లి క్రాసింగ్ వద్ద ఇండస్ట్రియల్ పార్క్ నిర్మించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన అన్ని సర్వేలను పూర్తి చేశారన్నారు. త్వరలోనే నోటిఫికేషన్ సైతం రానున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ప్రకారం రైతులకు భరోసా పథకం కింద డబ్బులను త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారన్నారు.

'డివిజన్' సాధించే వరకు పోరాటం

- సీఎం హామీని అమలు చేయాలి
- జేఏసీ చైర్మన్ వకులాభరణం నరసయ్య



కలెక్టరేట్ ఎదుట చేర్యాల డివిజన్ కమిటీ నాయకుల ధర్నా

సిద్దిపేటరూరల్: చేర్యాలను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేవరకు ఉద్యమం ఆగదని జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణి లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా డివిజన్ కోసం పోరాడుతున్నామన్నారు. గతంలో డివిజన్ కోసం ధర్నా నిర్వహిస్తున్నప్పుడు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని మాట ఇచ్చారన్నారు. అదేవిధంగా సీఎం కూడా డివిజన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇరువురు హామీని నిలబెట్టుకోవాలని కోరారు. రెవెన్యూ డివిజన్ పాత జిల్లాలో ఉండడం వలన అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అన్ని పార్టీల నాయకులతో కలుపుకొని ఐక్య ఉద్యమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మున్సిపల్ చైర్మన్ వంగ స్వరూప రాణి, ఆముదాల మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ రాజేందర్, బాల్ నరసయ్య, అఖిల పక్ష నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలో ఓ వ్యక్తి తన కిరాణా దుకాణంతో పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 3కిలోల చైనా మాంజా బండల్స్‌ను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ చైనా మాంజా వాడకం వల్ల మనుషులతో పాటు పక్షులకు సైతం హాని జరిగే అవకాశముందని, చైనా మాంజా మెడకు, కాళ్లకు తగిలి చనిపోయిన సంఘటనలు సైతం ఉన్నాయన్నారు. ఎవరైనా చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులకు (87126 67445, 87126 67446, 87126 67447) సమాచారం అందించాలని సూచించారు.

రూ.1,19,700 విలువైన మాంజా స్వాధీనం

సిద్దిపేటకమాన్: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన ప్రభుత్వ నిషేధిత చైనా మాంజాను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బాలాజీ బుక్ డిపోకు చెందిన మురళీ అతడి ఇంట్లో నిషేధిత చైనా మాంజా కలిగి ఉన్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రూ.1,19,700 విలువ గల చైనా మాంజా బండిల్స్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ సాయిప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో చైనా మాంజాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నీళ్ల కోసం మరో ఉద్యమం

- నగరానికి వెళ్లే 'మల్లన్న' జలాలను అడ్డుకుంటాం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: జిల్లాలోని పంటలకు నీళ్లివ్వకుంటే హైదరాబాద్‌కు వెళ్లే మల్లన్నసాగర్ జలాలను అడ్డుకుంటామని.. అవసరమైతే నీళ్ల కోసం మరో ఉద్యమం చేపడతామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం దుబ్బాక మండల పరిధిలోని హబ్షీపూర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై నియోజకవర్గంలోని రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి భారీ ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఎల్కతుర్తి-మెదక్ జాతీయ రహదారిపై గంటకు పైగా బైఠాయించి ఆందోళన చేపట్టడడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన విరమించాలని కోరారు. వినకపోవడంతో బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను, ప్రజలను మోసం చేయడమే ప్రజాపాలననా? అంటు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మల్లన్నసాగర్ కాలువల నిర్మాణం ఆగిపోయిందన్నారు. కనీసం చెరువులు, కుంటల్లో తట్టెడు మన్ను తీసిన దాఖలాలు లేవన్నారు. మల్లన్నసాగర్ కాలువలు పూర్తి చేసి పొలాలకు నీళ్లివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.



హబ్షీపూర్‌లో జాతీయ రహదారిపై రైతులు, బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన

క్లుప్తంగా

89 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

సిద్దిపేట సీపీ అనురాధ



డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా 89 కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసు కమిషనరేట్ పరిధిలో ఆదివారం రాత్రి పోలీసు సిబ్బంది ఆకస్మిక వాహనాల తనిఖీ నిర్వహించి డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేశారన్నారు. ఇందులో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ ఉపేందర్, రూరల్ సీఐ శ్రీను, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకే 'చుక్క'లు చూయించాడు

- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తి
- దుర్భాషలాడటంతో వదిలిపెట్టిన ఖాకీలు



రోడ్డుపై వాహనదారుడితో పోలీసులు

అల్లాదుర్గం(మెదక్): మద్యం మత్తులో ఉన్న వాహనదారుడు పోలీసులకే చుక్కలు చూయించాడు. వివరాల్లోకి వెళ్తే..అల్లాదుర్గం చౌరస్తాలో సోమవారం పోలీసులు డ్రంకైన్ డ్రైవ్ నిర్వహించారు. బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి ఊదమన్నారు. మద్యం మత్తులో ఉన్న ఆ వ్యక్తి ఊదకుండా పోలీసులను అరగంటపైనే ఇబ్బంది పెట్టాడు. అనంతరం ఇష్టం వచ్చినట్లు తిట్టడం మొదలు పెట్టాడు. తాగుబోతు దుర్భాషలాడటంతో తట్టుకోలేక పోలీసులు వదిలి పెట్టారు.

జేసీబీకి నిప్పు



కాలిపోతున్న జేసీబీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): గుర్తు తెలియని దుండగులు జేసీబీకి నిప్పు పెట్టిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి, పోలీసుల కథనం మేరకు.. మునిగడప గ్రామానికి చెందిన మరాఠీ బాలస్వామి జేసీబీతో ఉపాధి పొందుతున్నాడు. రోజువారిలాగే గ్రామంలోని పాఠశాల సమీపంలో రోడ్డు పక్కన జేసీబీని పెట్టాడు. ఆదివారం కుటుంబ సభ్యులంతా కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వెళ్లారు. అదేరోజు అర్ధరాత్రి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కోళ్లబండితో వెళ్తూ జేసీబీ దగ్ధం కావడాన్ని చూసి బాలస్వామికి చెప్పాడు. వారు వచ్చేసరికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ చంద్రమోహన్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సోమవారం సీఐ మహేందర్‌రెడ్డి వాహనాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జింక్ లోపం.. జాగ్రత్తలతో మాయం



- అధిక భాస్వర వినియోగంతో వరికి ముప్పు
- జింక్ సల్ఫేట్‌తో లోపాన్ని సవరించుకోవాలి
- సిద్దిపేట అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: వరిలో అధికంగా భాస్వరం ఎరువుల వినియోగంతో జింక్ లోపం ఏర్పడుతుందని, దీని నివారణకు నారుమడిలోనే జింక్ సల్ఫేట్‌ను వెదజల్లుకోవాలని సిద్దిపేట అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్ సూచించారు. మండలంలోని నాంచార్‌పల్లి గ్రామంలో పురుమాండ్ల ఇంద్రసేనారెడ్డికి చెందిన పొలంలో జింక్ లోప లక్షణాలని గుర్తించి రైతులకు తగు సూచనలు చేశారు.

జింక్ లోపానికి దారి తీసే పరిస్థితులు..

నేలలో అధిక భాస్వరం వినియోగంతో జింకు లోపం ఏర్పడుతుంది. వరిలో అత్యధికంగా లోపించే మూలకం జింకు. ఆధునిక రకాలు, పంటల ముమ్మర సాగు, జింకు అధికంగా తీసుకునే రకాల వాడకంతో లోప లక్షణాలు పెరుగుతున్నాయి. జింకు లోపం ప్రధానంగా తటస్థ, సున్నపు, పంట మార్పిడి చేయని, మురుగు నీరు బయటకు వెళ్లే సౌకర్యం లేని, క్షారత్వపు, చౌడు నేలలు, ఇసుక నేలలు, ఫాస్పరస్, సిలికాన్ మూలకాలు అధికంగా ఉన్న నేలలు, కోతకు గురయ్యే నేలల్లో జింకు లోపం అధికంగా ఉంటుంది. కాలుష్యపు మురుగు నీరు పారించే నేలలు, అధికంగా సేంద్రియ ఎరువులు, పంట వ్యర్థాలు వాడే నేలల్లో కూడా జింకు లోప లక్షణాలు కనిపిస్తాయి.

నాలుగు వారాల్లో లక్షణాలు బయటికి

- సాధారణంగా ప్రధాన పొలంలో నాటిన రెండు నుంచి నాలుగు వారాల్లో జింకు లోప లక్షణాలు కనిపిస్తాయి.
- మొక్కలు గిడసబారుతాయి, గిడస బారిన మొక్కల ఆకులపై బ్రౌన్ మచ్చలు కనిపిస్తాయి.
- మొక్కలు అసహజంగా పెరుగుతాయి. పొలంలో అక్కడక్కడా అంతగా ఏనుకోని మొక్కలు ఉంటాయి.
- నత్రజని ఎరువులు వేసినప్పటికీ పైరు పచ్చపడదు. కంకుల్లో తాలు ఏర్పడుతుంది.
- లేత ఆకుల్లో మొదలు దగ్గర, మధ్య ఈనెలు పాలిపోతాయి. ఆకు మధ్య ఈనెల వెంబడి తెల్లని చార ఏర్పడుతుంది. ఆకు వ్యాసార్థం తగ్గుతుంది. ఆకులు పెలుసుగా ఉండి, వంచగానే శబ్ధం చేస్తూ విరిగిపోతాయి. - పొలంలో నీరు ఎక్కువగా ఉన్న సమయంలో బైకార్బొనేట్ల సాంద్రత పెరిగి పంట తొలి దశలో జింకు లోపం లేత ఆకుల్లో కన్పిస్తుంది. అయితే 4-6 వారాలలో పంట తిప్పుకుంటుంది.
- ఒకవేళ మొదల్లో లోప లక్షణాలు ఎక్కువగా ఉంటే పంట ఆలస్యంగా కోతకు వస్తుంది. దిగుబడులు తగ్గుతాయి.



జింకు లోపం ఏర్పడిన వరి పైరు



నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్న ఏఓ శ్రీనాథ్

తీసుకోవాల్సిన చర్యలు...

- వరి నారుమడుల్లో జింకు సల్ఫేట్ వెదజల్లాలి. 2 నుంచి 4 శాతం జింకు ఆక్సైడ్ ద్రావణంలో నారు ముంచి ప్రధాన పొలంలో నాటాలి.
- వరి పంట పండించే భూముల్లో ప్రతీమూడు పైర్లకు ఒకసారి, రెండు పంటలు పండించినట్లయితే ప్రతీ యాసంగిలో ఆఖరి దమ్ములో ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి.
- లీటరు నీటికి 20 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి ఐదురోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి.
- జింకు సల్ఫేట్ భాస్వరం ఎరువుతో కలిపి వేయరాదు. ఈ రెండింటి వాడకానికి మధ్య కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి.
- పురుగు, తెగుళ్ల మందులను జింకు సల్ఫేట్ ద్రావణంలో కలిపి వాడరాదు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ, వివిధ శాఖల అధికారులు

- సిద్దిపేట సీపీ అనురాధ
- ఆపరేషన్ స్మైల్ పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేటకమాన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ అమలుపై వివిధ శాఖల అధికారులతో సీపీ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ స్మైల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు పిల్లలు బాలకార్మికులుగా పని చేస్తున్నట్లు గుర్తిస్తే వారిని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి వారికి అప్పగించడం లేదా రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపించాలని సూచించారు. జిల్లాలో మూడు డివిజన్‌లను ఏర్పాటు చేసి సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్‌కు అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. షీ టీమ్ సిబ్బంది కూడా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలన్నారు. బాల కార్మికుల గురించి సమాచారం ఉంటే డయల్ 1098, 112, 100 లేదా సిద్దిపేట పోలీసు కంట్రోల్ రూమ్ నంబర్ 87126 67100 కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ఏసీపీ యాదగిరి, ఎస్‌బీ సీఐ కిరణ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో తల్లి మృతి.. ఆచూకీ లేని తండ్రి

- బిక్కుబిక్కుమంటూ మృతదేహం వద్ద పిల్లలు
- చందాలు వేసుకొని అంత్యక్రియలు నిర్వహించిన గ్రామస్తులు
- గజ్వేల్ మండలంలో ఘటన



తల్లి మృతదేహం వద్ద దీనంగా కూర్చున్న పిల్లలు

గజ్వేల్‌రూరల్: రెక్కాడితేగాని డొక్కాడని ఆ నిరుపేద కుటుంబానికి ఎటువంటి ఆస్తిపాస్తులు లేవు. ఏడేళ్లలోపు ముగ్గురు పిల్లలతో అడ్డామీద కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో భార్య అనారోగ్యానికి గురికావడంతో ఆమె వెంటే ఆస్పత్రికి వెళ్లిన భర్త ఆచూకీ లేకుండా పోయాడు. ఈ సమాచారం అందుకున్న బంధువులు అనారోగ్యంతో ఉన్న మహిళను ఇంటికి తీసుకువచ్చినరోజే మృతి చెందడంతో అనాథలుగా మారిన ఆ ముగ్గురు పిల్లలు తల్లి మృతదేహం వద్ద బిక్కుబిక్కుమంటూ దిక్కుతోచని స్థితిలో దీనంగా కూర్చుండిపోయారు. గ్రామస్తులు, సమీప బంధువులు చందాలు వేసుకొని అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల పరిధిలోని బంగ్లావెంకటాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన నాగమణి(32), నర్సింహులు దంపతులకు ఏడేళ్లలోపు రాజేందర్, హరికృష్ణ, చందులు ఉన్నారు. పెంకుటిళ్లు తప్ప ఎటువంటి ఆస్తిపాస్తులు లేని దంపతులు ప్రతినిత్యం గజ్వేల్‌కు వచ్చి అడ్డామీద కూలీలుగా పనికి వెళ్తుండేవారు. ఇటీవల అనారోగ్యానికి గురైన నాగమణి స్థానికంగా చికిత్స చేయించుకున్నప్పటికీ తగ్గకపోవడంతో మెరుగైన చికిత్స కోసం భర్తతో పాటు సమీప బంధువులు గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన నర్సింహులు కుటుంబ సభ్యులకు, బంధువులకు కనిపించకుండా పోయాడు. వారం రోజుల పాటు గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ నాగమణి కోలుకోకపోవడంతో వైద్యుల సూచన మేరకు బంధువులు ఆదివారం సాయంత్రం స్వగ్రామమైన బంగ్లావెంకటాపూర్‌కు తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఇంటికి వచ్చిన గంటల వ్యవధిలోనే నాగమణి మృతి చెందింది. దీంతో ఆ ముగ్గురు చిన్నారులు తల్లి మృతదేహం వద్ద బిక్కుబిక్కుమంటూ దిక్కుతోచని స్థితిలో కూర్చుండిపోయారు. ఈ విషాదకరఘటనను చూసిన బంధువులు, గ్రామస్తులు కన్నీటిపర్యంతమై చందాలు వేసుకొని అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిని కోల్పోయి... తండ్రి ఆచూకీ తెలియని ఆ చిన్నారులను చూసిన వారంతా భావోద్వేగానికి లోనవుతూ ఆ నిరుపేద కుటుంబాన్ని దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయండి

- జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి
- బంజేరుపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న స్వాతిరెడ్డి

సిద్దిపేటరూరల్: సమాజంలో హింసలు, గృహ హింసలు, లైంగిక వేధింపులకు గురయ్యే పేదలకు సేవ చేయడానికి లీగల్ సర్వీసెస్ అథారిటీ ఉందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి సూచించారు. సోమవారం నారాయణరావుపేట మండల పరిధిలోని బంజేరుపల్లి గ్రామంలో లైంగిక వేధింపులు, గృహహింస చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వాతిరెడ్డి హాజరై మాట్లాడారు. ఎవరైనా పని ప్రదేశాల్లోగాని, మరెక్కడైనా గాని లైంగికంగా వేధింపులకు గురి చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ టోల్‌ఫ్రీ నంబర్ 15100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ చట్టాలను గురించి తెలుసుకోవాలన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా మహిళలు ఉచిత న్యాయ సలహాలను పొందవచ్చన్నారు. అంతకు ముందు ఏసీపీ మధు మాట్లాడుతూ.. సమాజంలో మహిళలపై ఎక్కడ ఎలాంటి అరాచకాలు జరిగిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, 24 గంటల పాటు పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందని డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అనంతరం సీఐ శ్రీను మాట్లాడుతూ.. మహిళలు వారికోసం ఉన్న చట్టాలు, హక్కులను తెలుసుకోవాలన్నారు. అనంతరం స్వాతిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వరెడ్డి, ఎంపీడీఓ శ్రీరాములు, ఎంపీఓ శ్రీనివాస్‌రావు, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి : వీరారెడ్డి



మాట్లాడుతున్న వీరారెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): ఇష్టంతో చదివి భయం లేకుండా పరీక్షలు రాయాలని శాసన మండలి అసిస్టెంట్ సెక్రటరీ, మోటివేటర్ బీ.వీరారెడ్డి సూచించారు. సోమవారం చిన్నశంకరంపేట మండలం సూరారం జెడ్పీ పాఠశాల ఆవరణలో పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు చెప్పింది వినడంతోపాటు ఒకసారి ఇంటి వద్ద రివైజ్ చేసుకుంటే సబ్జెక్ట్‌పై పట్టు సాధిస్తారన్నారు. పరీక్షల కోసం సంసిద్ధమవడంతోపాటు జీవితంలో ముందుకు సాగేందుకు తీసుకోవాల్సిన అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సూరారం, ధరిపల్లి పాఠశాల విద్యార్థులు, హెచ్‌ఎంలు సాయిరెడ్డి, శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

పాపన్నపేట(మెదక్): హత్య కేసులో నిందితులైన ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, సెషన్స్ జడ్జి లక్ష్మీశారద సోమవారం తీర్పునిచ్చినట్లు మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పేటకు చెందిన దొంతి నారాయణ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన కోలస్ రామక్రిష్ణ, బీరంగూడకు చెందిన కొమ్ము ప్రసాద్‌కు రూ.10 వేలు అప్పుగా ఇచ్చాడు. ఆ డబ్బులను తిరిగి ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో రామక్రిష్ణ, కొమ్ము ప్రసాద్ ఇద్దరూ దొంతి నారాయణను 19 నవంబర్ 2019న పాపన్నపేట మండలం ఏడుపాయలకు తీసుకొచ్చి కత్తితో గొంతు కోసి హత్య చేశారు. అప్పటి సీఐ రాజశేఖర్, ప్రస్తుత సీఐ రాజశేఖర్ రెడ్డి విచారణ చేయగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ ఫజల్ అహ్మద్ కోర్టులో వాదనలు వినిపించారు. ఈ మేరకు జడ్జి లక్ష్మీశారద నిందితులిద్దరికీ జీవిత ఖైదుతోపాటు రూ. 15 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో రూ.5 లక్షలు చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ, సీఐ

నగదుతోపాటు ఆభరణాలు అపహరణ

దుబ్బాకరూరల్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని రామక్కపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. సంగెపు రాజమణి తన కుమారుడు నవీన్‌తో కలిసి 4వ తేదీన అక్బర్‌పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో బంధువుల ఇంట్లో దశదినకర్మకు వెళ్లారు. రాజమణి భర్త బాలయ్య కూలీ పని చేస్తూ ఇద్దరు కూతుళ్లతో కలిసి హైద్రాబాద్‌లో ఉంటాడు. రాజమణి తన కుమారుడితో కలిసి 5న సాయంత్రం ఊరు నుంచి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో చూడగా సుమారు రూ.5 లక్షల నగదు, 5 తులాల బంగారం, 4 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. దొంగలు పడ్డారని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించారు. సిద్దిపేట ఏసీపీ మధు, సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకరూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. అక్బర్‌పేట భూంపల్లి మండలం నగరం గ్రామ ఎక్స్‌రోడ్డులో శ్రీరామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి విద్యా సాంస్కృతిక సంబురాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతోపాటు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోధనకే పరిమితం కాకుండా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల స్టేజిఫియర్ పోతుందన్నారు. పలు రకాల ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న కళను బయటకు తీయొచ్చన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసలు కావొద్దన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ అంజయ్య, మల్లేశం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని కౌలు రైతు ఆత్మహత్య

కల్హేర్(నారాయణఖేడ్): ఉరేసుకొని కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కల్హేర్ మండలం బీబీపేట్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశం కథనం మేరకు.. గ్రామానికి చెందిన కర్రెకుర్మ గంగారం(42) వరుసకు మరదలైన సత్యమ్మ వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. కౌలు డబ్బుల విషయంలో ఇద్దరికి గొడవ జరిగింది. భూమి కౌలు తీసుకొని చేస్తే తీవ్ర నష్టం వచ్చిందని మనస్తాపం చెంది బావి వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశం తెలిపారు.

తాగుడుకు బానిసై వ్యక్తి..

చేగుంట(తూప్రాన్): తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మాసాయిపేట మండల పరిధిలోని నాగసాన్‌పల్లి గ్రామంలో జింక కృష్ణ (45) కొంత కాలంగా తాగుడుకు బానిసై పని చేయకుండా నిత్యం ఇంట్లో గొడవలు పడుతుండేవాడు. సోమవారం తన గుడిసెలో సీలింగ్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య అనిత, కుమారుడు రిషిక్ ఉన్నారు. మృతుడి అన్న జింక ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి విద్యార్థులే.. భావి భారత పౌరులు

సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్



విద్యార్థులతో అప్పాల ప్రసాద్

దుబ్బాక : నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ జీ అన్నారు. సోమవారం దుబ్బాక పట్టణంలోని సరస్వతీ గ్లోబల్ స్కూల్‌లో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, పరీక్షలకు సన్నద్ధత, ఉన్నత ఫలితాలు సాధించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రుల కలను నిజం చేయాలన్నారు. కార్యక్రమంలో వేదిక మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు రుక్మిణీ, ఎంఈఓ ప్రభుదాసు, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్, ట్రిస్మా అధ్యక్షుడు రవీందర్, వేదిక జిల్లా కన్వీనర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందించారు.

హోరాహోరీగా మ్యాచ్‌లు



క్రీడాకారులకు మెమెంటో అందజేస్తున్న నిర్వాహకులు

సిద్దిపేటజోన్: స్థానిక స్టేడియంలో సోమవారం వివిధ జట్ల మధ్య సీఎం రేవంత్ రెడ్డి క్రికెట్ కప్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఖాతా, నారాయణరావుపేట జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 25 పరుగుల తేడాతో ఖాతా జట్టు విజయం సాధించింది. అదే విధంగా యువసేన యూత్, బీసీసీఎల్ లెజెండ్స్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో 41 పరుగుల తేడాతో లెజెండ్స్ గెలుపొందింది. గంగాపూర్, కోదండరావుపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 60 పరుగుల భారీ తేడాతో గంగాపూర్ జట్టు విజయం సాధించింది. యూనివర్సల్, కేకేసి లగన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 17పరుగుల తేడాతో యూనివర్సల్ జట్టు విజయం సాధించింది. ఆయా మ్యాచ్‌లలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని మెమెంటోతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ ఆహారాన్ని తీసుకోవాలి

యువత జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి

- ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత
- ఘనంగా పచ్చి కందుల పండుగ



వంటకాలను తిలకిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

సిద్దిపేటఎడ్యుకేషన్: యువత జంక్ ఫుడ్‌ను వదిలేసి, సాంప్రదాయ ఆహారాన్ని తీసుకోవాలని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. సోమవారం కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో నవకల్పన కార్యక్రమంలో భాగంగా పచ్చికందుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి పండుగలు తెలంగాణ ఆహార సంస్కృతిని ప్రతిబింబిస్తాయన్నారు. మన ఆహార సంస్కృతీ ఎంత సరళమైనదో అంతే స్వచ్ఛమైనదన్నారు. జంక్‌ఫుడ్, రెడీమేడ్ ఫుడ్‌ను వదిలి సహజమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమ రూపకర్త, తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ మట్టా సంపత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతను సాంప్రదాయ ఆహారం వైపు మళ్లించేందుకు పచ్చికందుల పండుగను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగు విద్యార్థులు గుడాలు, కుడుములు, సర్వపిండి, రొట్టె, బగారన్నం, ఉప్పుప్యాలాలు, ఉడకబెట్టిన, కాల్చిన కందికాయ, కందుల సేమ్యా, కందుల న్యూడిల్స్, కందుల మిక్షర్, సలాడ్ తదితర 80 రకాల వంటకాలను ప్రదర్శించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది వంటకాలను తిలకించి రుచిచూసి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు పిట్లదాసు, వెంకటరమణ, సంపత్ కుమార్, శైలజ, నరేశ్, రామస్వామి, నర్సింలు, సాయిసురేశ్ తోపాటు ఆయా విభాగాల అధ్యక్షులు, యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.